పాదచారులకు మజ్జిగ పంపిణీ



లాలాపేట: తార్నాకలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాదచారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాయకులు మల్లేశ్వరి, వీరయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

కులగణనను స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న ప్రొ. సింహాద్రి

లాలాపేట: జాతీయ స్థాయిలో కులగణనను జనగణనతో చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సింహాద్రి అన్నారు. శుక్రవారం తార్నాకలోని ఆ పార్టీ కార్యాలయంలో సమాజ్‌వాది పార్టీ నాయకుల సమావేశం జరిగింది. అన్ని వర్గాల ప్రజలకు జనాభా దామాషా ప్రకారం అధికారం అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తోడ్పడుతుందన్నారు. పార్టీ నాయకులు డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు, అక్కల బాబుగౌడ్, శ్రీహరిముదిరాజ్ పాల్గొన్నారు.

కేబినెట్ నిర్ణయం చరిత్రాత్మకం



రాంగోపాల్‌పేట్: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర కేబినేట్ జాతీయ స్థాయిలో జనగణనతో పాటు కుల గణన చేస్తామని ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. గురువారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు సందీప్ వర్మ ఆధ్వర్యంలో మహంకాళి దేవాలయం ప్రాంతంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం తీసుకోని గొప్ప నిర్ణయాన్ని మోదీ ప్రభుత్వం తీసుకోవడం పట్ల దేశ వ్యాప్తంగా ప్రజలకు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్, మహంకాళి జిల్లా సహ కోశాధికారి ఎస్ఆర్ మల్లేష్ పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా ప్రకటించాలని నేడు (3న) రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసిన్నట్లు ప్రొ.గాలి వినోద్‌కుమార్ శుక్రవారం తెలిపారు. బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమగు కార్యక్రమానికి తమిళనాడు ఎంపీ డా.తిరుమావలవన్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల నాయకులు పార్టీలకు అతీతంగా హాజరుకావచ్చు అన్నారు.

మార్కెట్ ఇన్‌స్పెక్టర్‌గా రాంచందర్ బాధ్యతల స్వీకరణ



రాంగోపాల్‌పేట్: మార్కెట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా వి రాంచదర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న రాఘవేందర్ గుడిమల్కాపూర్ డీఐగా బదిలీ కాగా బేగంపేట టీటీఐలో ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రాంచందర్‌ను నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనందర్ ఇక్కడికి బదిలీ చేశారు. 2002 బ్యాచ్‌కు చెందిన రాంచందర్ హైదరాబాద్ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఎస్సైగా, ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

ఓయూ పీహెచ్‌డీ కీ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రాథమిక కీని విడుదల చేసిన్నట్లు అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొ.పాండురంగా రెడ్డి శుక్రవారం తెలిపారు. గత నెల 25, 26, 27 తేదీలలో 49 సబ్జెక్టులకు జరిగిన పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్–2025 జవాబుల కీని వెబ్‌సైట్లో విద్యార్థులకు అందుబాటు ఉంచినట్లు చెప్పారు. జవాబుల్లో అభ్యంతరాలను ఈ నెల 5 వరకు ఆన్‌లైన్‌లో తెలపవచ్చు అన్నారు. పూర్తి వివరాలను ఉస్మానియా వెబ్‌సైట్ చూడవచ్చు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బొల్లారం : బొల్లారంలోని గంగపుత్ర సంఘం, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించనున్నారు. గంగపుత్ర సంఘం హాలులో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహిస్తారు. శిబిరంలో కిమ్స్ హాస్పిటల్ నుండి జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్ డాక్టర్ లు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను కూడా అందజేస్తారని గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పూస యోగేశ్వర్, ప్రధాన కార్యదర్శి పి.ఎస్. జైరాజ్ తెలిపారు.

లాభం కన్నా నష్టమే ఎక్కువ

- ముగిసిన తార్నాక జంక్షన్ ట్రయల్ రన్
- కొద్ది రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగించనున్న అధికారులు!
- బారులు తీరుతున్న వాహనాలు
- తలలు పట్టుకుంటున్న అధికారులు



తార్నాక జంక్షన్‌లో వాహనాల రద్దీ

లాలాపేట: తార్నాక జంక్షన్ పునరుద్ధరణ ట్రయల్ రన్ శుక్రవారం అర్ధరాత్రితో ముగిసింది. నగర ట్రాఫిక్ అధికారులు ఏప్రిల్ 18న మూసివేసివేసిన జంక్షన్‌ను పునరుద్ధరించి వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. గత 15 రోజుల నుంచి ట్రయల్ రన్‌తో తార్నాక జంక్షన్ సిగ్నల్ వద్ద ట్రాఫిక్ కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడ స్తంభించిపోయి వాహనదారులకు గందరగోళ పరిస్థితులు ఎదురయ్యాయి. సమస్యలు సరిపెట్టేందుకు ట్రాఫిక్ పోలీసులకు తలకుమించిన భారంగా మారింది. ఈ కూడలిని దాటుకుని వెళ్లడానికి 30 నిమిషాల పైనే సమయం పడుతుండడంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. రహదారుల విస్తరణ లేకుండా జంక్షన్ పునరుద్ధరణ సరైన నిర్ణయం కాదన్న అభిప్రాయాన్ని స్థానికుడైన మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్‌రావు అభిప్రాయపడ్డారంటే ఇక్కడి ట్రాఫిక్ కష్టాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. పదేళ్ల క్రితమే వాహనాల రద్దీ ఇబ్బందుల దృష్ట్యా మూసివేసిన తార్నాక జంక్షన్ తాజాగా విస్తరణ లేకుండానే ఓపెన్ చేయడాన్ని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. పునరుద్ధరణ అనంతరం రహదారుల ఇరుకు ఒక కారణం కాగా, మధ్యలోంచి నెలకొని ఉన్న మెట్రో పిల్లర్లు మరో సమస్యగా మారుతున్నాయి.

సెలవుల్లోనే ఇలా ఉంటే...

విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాక ట్రయల్ రన్‌ను అధికారులు ప్రారంభించారు. సెలవుల్లో వాహనాల రద్దీ తక్కువగా ఉండే సమయంలోనే తార్నాక కూడలిలో వాహనాల రద్దీ సమస్యలు జటిలంగా ఉంటే ఇక విద్యా సంస్థలు ప్రారంభమయ్యాక పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడానికే భయంగా ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా తాజా పునరుద్ధరణ కోసం ప్రభుత్వం రూ. కోటి వెచ్చించింది ఆధునీకరించింది. కానీ అవసరమైనంతమేర రహదారులను విస్తరించ లేదు. ఇదిలా ఉండగా ట్రయల్ రన్ ముగిసినప్పటికీ జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు పునరుద్ధరణ విషయంలో ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు. విధుల్లో ఉంటున్న సిబ్బంది, వాహనదారులు మాత్రం జంక్షన్ పునరుద్ధరణ సమంజసం కాదంటున్నారు. కాగా కొందరు ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు జంక్షన్‌ను పునరుద్ధరించిన క్రమంలో ఇంకొంత కాలం ఇదే పరిస్థితిని కొనసాగించాలని అధికారులు భావిస్తున్నారు. కొందరు స్థానికులు మాత్రం జంక్షన్ మీదుగా రాకపోకలు కొనసాగిస్తూనే ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

వెయిటేజీ మార్కులు ఇవ్వండి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల్లో త్వరలో నియమించనున్న అధ్యాపక ఉద్యోగాల భర్తీలో ఇండస్ట్రీ సర్వీసు గల అభ్యర్థులకు వెయిటేజీ మార్కులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ ప్రొఫెషనల్ డాక్టరేట్స్ (టీజీఏఐపీడీ) అధ్యక్షులు డా.రామస్వామి, ప్రధాన కార్యదర్శి డా.బొల్లం తిరుపతి ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డికి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. అధ్యాపక ఉద్యోగాల నియామకానికి ప్రభుత్వం విడుదల చేసిన జీవోనంబర్.21 లోను వేయిటేజీ మార్కుల ప్రస్తావన లేదని ఛైర్మన్‌కు వివరించినట్లు తెలిపారు.

అద్దె ఇంటి కోసం వచ్చి..

మహిళను కట్టేసి 30 గ్రాముల బంగారు నగల చోరీ

సికింద్రాబాద్: ఇల్లు అద్దెకు కావాలని వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి యజమానురాలిని కట్టేసి నగలు, నగదుతో ఉడాయించిన సంఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పార్శిగుట్టలోని ఓ ఇంట్లోని మొదటి అంతస్తులో పారిజాతం (56) అనే మహిళ నివాసముంటోంది. శుక్రవారం మధ్యాహ్నం ఆమె ఇంటికి వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇల్లు అద్దెకు కావాలంటూ ఇంట్లోకి చొరబడ్డారు. తలుపులు గడియపెట్టి ఆమెను కత్తితో బెదిరించి కుర్చీలో కట్టేశారు. ఇంట్లో ఉన్న 30 గ్రాముల బంగారు నగలు, 6 వేల నగదు, సెల్‌ఫోన్‌ను తీసుకుని పరారయ్యారు. కొద్ది సేపటికి కట్లు విప్పుకుని బయటికి వచ్చిన పారిజాతం చుట్టుపక్కల వారికి విషయం చెప్పింది. స్థానికులతో కలిసి శుక్రవారం సాయంత్రం ఆమె వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇంచార్జి ఇన్‌స్పెక్టర్ రమేష్ గౌడ్, ఎస్సై సుధాకర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అమీర్‌పేటఐ : ఎస్ఆర్‌నగర్ శ్రీ శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వైశాఖ శుద్ధ పంచమి రోజు శుక్రవారం ఉదయం వేదస్వస్తి, శ్రీ విశ్వక్సేన పూజ,ధ్వజారోహణం,గరుడ బలి హారతి,ప్రసాద వితరణ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. పూజల్లో ఆలయ ఛైర్మన్ బొడ్డు కుమార్‌గౌడ్, అర్చకులు వేణుగోపాలచార్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మన్ మృతి



యాదయ్ (ఫైల్)

అమీర్‌పేట : ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడ్డ ఓ వాచ్‌మన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఆర్‌నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు.. గాంధీనగర్‌లోని వాల్మీకి నగర్‌కు చెందిన ఎ.యాదయ్య (46) ఎస్ఆర్‌నగర్‌లోని నాగార్జున స్కూల్లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం తన యాక్టివా ద్విచక్ర వాహనంపై స్కూలుకు వెళ్తుండగా ఎస్ఆర్‌నగర్‌లో ఓ వ్యక్తి అడ్డుగా వచ్చాడు. దీంతో యాదయ్య సడన్ బ్రేక్ వేయడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: లోధా, జనప్రియా సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీటీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సనత్‌నగర్ డీఎస్ఎంకాలనీ, అశోక్‌కాలనీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్, , టీవీఎస్ షోరూం లేన్, మెథడిస్ట్ చర్చి లేన్, డీ మార్ట్ ఎదురు ప్రాంతం, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కల్పతరు అపార్ట్‌మెంట్స్, బ్రిగేడ్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..)టమాటా.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 8, క్యారెట్ 19, దొండ 28, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 27, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 75, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటి కాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఇన్‌స్పెక్టర్‌కు ఘనంగా వీడ్కోలు



లాలాపేట: యూనివర్సిటీ పోలీసు స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా సేవలందించిన ఇన్స్‌పెక్టర్ రాజేందర్ సైఫాబాద్‌కు బదిలీ అయిన సందర్భంగా శుక్రవారం సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. సబ్ ఇన్స్‌పెక్టర్లు, కానిస్టేబుళ్లు, సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు.

'పది' ఫలితాల్లో.. ప్రభుత్వ స్కూళ్ల సత్తా

- చతికిలపడ్డ ప్రైవేట్ పాఠశాలలు
- నగరంలో ఖైరతాబాద్ మూడో స్థానం
- గతేడాది కంటే మెరుగైన ఫలితాలు



ఎన్టీటీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు

బంజారాహిల్స్: రెండు రోజుల క్రితం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తాచాటగా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా అంతగా రాణించలేదు. ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తీర్ణత కూడా మెరుగ్గా కనిపించలేదు. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 17 ప్రభుత్వ, నాలుగు మైనార్టీ, రెండు రెసిడెన్షియల్, రెండు ఎయిడెడ్ స్కూళ్లలో ఈసారి పదో తరగతి ఫలితాలు 92 శాతం దాటాయి. గతేడాదితో పోలిస్తే ఈ సారి ఉత్తీర్ణత శాతం పెరగడమే కాకుండా హైదరాబాద్ జిల్లా పరిధిలోనే అత్యధిక మార్కులు రాజ్‌భవన్ హైస్కూల్ విద్యార్థిని హాసిని సాధించింది.

- రాజ్‌భవన్ హైస్కూల్‌లో విద్యార్థులు 500 పైచిలుకు మార్కులు పెద్ద ఎత్తున సాధించారు. దాదాపు అన్ని పాఠశాలల్లోనూ 500లకుపైగా మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య ఈ సారి భారీగా పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, అనుభవజ్ఞులైన టీచర్లు, ప్రత్యేక తరగతులు ఈసారి ఉత్తీర్ణత శాతం పెరగడానికి దోహదపడ్డాయి.
- ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులతో పాటు విద్యార్థులు ఆకలితో ఉండకుండా అల్పాహారం కూడా అందించారు. ఇది కూడా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు దోహదపడింది.
- ప్రైవేట్ పాఠశాలల విషయానికి వస్తే పేరుగొప్ప ఊరుదిబ్బ అన్న చందంగానే మొన్నటి ఫలితాల్లో కనిపించింది. పేరుకు మాత్రం వందశాతం ఉత్తీర్ణత సాధించామంటూ గొప్పలు పోయినా మార్కుల దగ్గరికి వచ్చేసరికి అంతగా రాణించినట్లు కనిపించలేదు. ప్రతియేడాది ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు రావడంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుంచి తొలగించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని ఉపాధ్యాయులు నిలబెట్టారు.
- ఈ సారి ఫలితాలు కూడా ఆశించిన స్థాయిలో రావడంతో ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరతారని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత స్కూల్ యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఇవి ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడానికి ప్రధాన కారణమని ఉపాధ్యాయులు తెలిపారు.
- మరో వైపు హైదరాబాద్ జిల్లా పరిధిలో 12 జోన్లు ఉండగా ఖైరతాబాద్ జోన్ ఫలితాల్లో మూడో స్థానంలో నిలిచింది. ఈ జోన్ పరిధిలోని విద్యార్థులు కూడా ఎక్కువగా పది పరీక్షలు రాశారు. మిగతా జోన్లతో పోలిస్తే విద్యార్థుల సంఖ్య పాఠశాలల సంఖ్య ఎక్కువగా ఉన్న ఫలితాలు కూడా ఆ స్థాయిలోనే తీసుకురాగలిగారు.

నగరంలోనే మొదటి స్థానం



విద్యార్థిని హాసిని

బంజారాహిల్స్: రెండు రోజుల క్రితం వెలువడ్డ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో హైదరాబాద్ జిల్లా పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిగా రాజ్‌భవన్ హైస్కూల్ విద్యార్థిని హాసిని నిలిచింది. రాజ్‌భవన్ హైస్కూల్‌లో చదువుతున్న హాసిని 574 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల నుంచి టాపర్‌గా నిలిచింది. తండ్రి ప్రవీణ్ ఆటో డ్రైవర్ కాగా తల్లి ధనశ్రీ గృహిణి. ఈ సందర్భంగా రాజ్‌భవన్ హైస్కూల్ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. తనకు డాక్టర్ కావాలని ఉందని ఈ సందర్భంగా హాసిని తెలిపింది.

సంక్షేమంలో రాజీ లేదు : ఎమ్మెల్యే శ్రీగణేశ్



లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, పేదల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడటం లేదని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం సికింద్రాబాద్ మండల పరిధి లోని 42 మంది లబ్ధి దారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పికెట్ లోని క్యాంపు కార్యాలయంలో సికింద్రాబాద్ ఎమ్మార్వో పాండు నాయక్‌తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ కాలంలో ఈ చెక్కులు చాలా ఆలస్యంగా వచ్చేవని కాని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత వేగంగా చెక్కులను పంపిణీ చేస్తోందని అన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు.

ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తోంది



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: భారతీయ జనతా పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఐదోవార్డు ఇంచార్జ్ పెద్దాల నర్సింహ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం చేపట్టిన 'జై బాపూ జై భీమ్ జై సంవిధాన్' ర్యాలీని నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కాల్వ సుజాతతో కలిసి ప్రారంభించారు. తొలుత పహల్గామ్‌లో టెర్రరిస్టుల ఘాతుకానికి బలైన అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీకి ప్రజాస్వామ్యంపై ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. పదేళ్లుగా కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించకపోవడమే ఇందుకు నిదర్శమన్నారు. బీజేపీకి చెందిన నామినేటెడ్ సభ్యులతో పాలన సాగిస్తూ కంటోన్మెంట్ ప్రజలను ఘోరంగా అవమానిస్తోందన్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, జై ప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ నేతలు పెద్దాల నర్సింహ, సతీష్ గుప్తా పాల్గొన్నారు.

కొడారి రాజుకు శ్రమశక్తి అవార్డు



శ్రమశక్తి అవార్డు అందుకుంటున్న కొడారి రాజు

సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ ఉత్తర మండలం ఐఎన్‌టీయూసీ నాయకుడు కొడారి రాజుకు శ్రమశక్తి అవార్డు ప్రదానం చేశారు. మేడే వేడుకలు పురస్కరించుకుని గాంధీభవన్‌లో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎంపీ వీ.హన్మంతరావు చేతుల మీదుగా కొడారి రాజు అవార్డును అందుకున్నారు. పదేళ్లుగా ఉత్తర మండలం జీహెచ్ఎంసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరాటంక ఆందోళనలు నిర్వహించినందుకుగాను కొడారి రాజుకు శ్రమశక్తి అవార్డు లభించింది. అవార్డు అందుకున్న కొడారి రాజును పలువురు సికింద్రాబాద్ జోన్ జీహెచ్ఎంసీ అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

చదువు ఆపకుండా కొనసాగించాలి



సమావేశంలో పాల్గొన్న సమాఖ్య ప్రతినిధులు

అడ్డగుట్ట: మారేడుపల్లి మండల ఆజా చంద్రశేఖర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో 'తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య కమిటీ '(టీఏఎస్ఎస్) మండల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంవి. ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఏవీఎం స్వామి, తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య హైదరాబాద్ జిల్లా సభ్యురాలు వి. సువర్ణలు ఆడపిల్లల సమస్యలు.. లింగ సమానత్వం గురించి చర్చించారు. ఆడపిల్లలు పదవ తరగతి తో ఆగకుండా ఉన్నత చదువులు చదవాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా ప్రతీ ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతిని అడ్డుకోండి..



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నవీన్‌కుమార్

సనత్‌నగర్: టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతికి పాల్పడుతూ, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న చైన్‌మెన్ (మున్షీ)లపై చర్యలు తీసుకోవాలని బేగంపేటకు చెందిన దళిత చైతన్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముప్పిడి నవీన్‌కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నవీన్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా సికింద్రాబాద్ జోన్ పరిధిలోని సికింద్రాబాద్, బేగంపేట ప్రాంతాల్లో చైన్‌మెన్లు గత 15–20 సంవత్సరాలు పాతుకుపోయి ఒకేచోట పనిచేస్తున్నారని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

అందాల పోటీలు కాదు...నాణ్యమైన విద్యను అందించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రానికి కావాలసింది అందాల పోటీలు కాదని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ శుక్రవారం కోరారు. అందాల పోటీలకు వెచ్చించే రూ.200 కోట్లు వ్యయంతో రాష్ట్రానికి వచ్చే ప్రయోజనం శూన్యమన్నారు. పరిశోధనలకు ప్రోత్సహించేందుకు ఫెలోషిప్‌లను మంజూరు చేయాలని, వర్సిటీల విద్యార్థులకు ఫెలోషిప్‌లు లేనందున పీహెచ్‌డీలు మధ్యలోనే ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధ్యతలు స్వీకరించిన బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్



నూతన ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజుకు స్వాగతం పలుకుతున్న బదిలీపై వెళ్తున్న లక్ష్మీనారాయణ రెడ్డి

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన తిరుపతి రాజు శుక్రవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ నుంచి బదిలీపై వెళ్తున్న లక్ష్మీ నారాయణ రెడ్డిని స్టేషన్ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఏడాదిన్నర క్రితమే బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన లక్ష్మీనారాయణ రెడ్డి స్వల్పకాలంలోనే బదిలీపై వెళ్లడం గమనార్హం. లక్ష్మీనారాయణ రెడ్డి 123 సీసీ కెమెరాలతో పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులన్నీ నిఘా నేత్రం నీడలోకి తెచ్చేందుకు విశేష కృషి చేశారు. సీసీ కెమెరాల ప్రారంభోత్సవం రోజే ఆయన బదిలీ అయ్యారు.



వివేకానంద కాలనీ వద్ద..



బొల్లారం పోలీస్ స్టేషన్ లైన్ వద్ద..

ఎక్కడ చూసినా చెత్తే..!

బొల్లారం: సికింద్రాబాద్ కంటోన్మెంట్ 8 వ వార్డు పరిధిలో ఎక్కడ చూసినా చెత్తే కనిపిస్తోంది. ప్రజల నిర్లక్ష్యంతో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రధాన దారుల పక్కన చెత్తకుప్పలు పెరిగిపోతున్నాయి. చెత్తబుట్టలు ఏర్పాటు చేసినా, కొందరు ఇంకా చెత్తను రోడ్డుపైనే పారేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల, వివేకానంద విగ్రహం, బొల్లారం పోలీస్ స్టేషన్‌లైన్ దగ్గర ఇలా అనేక ప్రాంతాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త రోజురోజుకూ పెరిగిపోతుండటంతో అనారోగ్యం బారినపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.